కథానిక:

# "అదృష్టహీనులు"

## 'శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ'

ఎటువంటి మహత్తర విషయాన్నైనా, చూసీ చూడ్డంతోనే యిట్టే అవలీలగా గ్రహించే శక్తి కొందరి కుంటుంది. అదే విషయాన్ని గ్రహించటానికొకప్పుడు కొందరికి కొంతకాలంకూడా పట్టొచ్చు. మరికొందరి విషయంలో – యిదే సత్యాన్ని గుర్తించేటందుకుగాను 'అనుభవం' పేరిట అనేక సంవత్సరాల జీవితకాలాన్ని వ్యర్థంగా వ్యయపర్చవలసి వస్తుంది.

మానవజీవితి పరమ రహస్యాల్లో యిదొకటి.

సుబ్రహ్మణ్యానికి నలభై రెండేళ్ల ఆఫీసుజీవితంలో ఒక్కనాడూ యీవిషయం గుర్తుకువచ్చిన పాపాన పోలేదు. ఇంత కాలం తను చలనం లేని శుష్క సంస్కారరహితమైన జీవితంలోనే వుంటూ వచ్చాడా? నిజానికిప్పుడతని దగ్గర మనస్సుని కుదుట పర్చుకోవటం కోసం కర్చు పెడదామంటే 'కన్నీటిబొట్లు' కూడా కరువేనా! ఈ యిరువై నాలుగేళ్ల ఆఫీసుజీవితం పూర్తికాగా యిక తనకుగాను మిగిలేది అస్థిమాత్రావశిష్టమైన ఒక శుష్క కాంకాళమేనా? ఎట్లాగైనా యీ జీవితంలోంచి తప్పించుకుని వురికి బయటపడితే బాగుండునని పించింది సుబ్రహ్మణ్యానికి.

పద్దెనిమిదేళ్ల చిన్నతనపు వయసుపొంగుల్లో, వెధవ ముప్ఫైరూడు రూపాయల ఆదాయాన్నపేక్షించి తలను అమ్ముకోవలసి వచ్చింది. ఆనాటినుంచి క్రమక్రమంగా శరీరాంగాల్లో మానవికత పుటుక్కుమని తెగి కాలంతో శరీరానికి చాకిరీకి నిమిత్తం లేకుండా – జీవితమంతా జీతపురాళ్ల కోసం కర్చుపెట్టవలసి వచ్చిందంటే – తల్చుకున్నప్పుడు సుబ్రహ్మణ్యానికి దుఃఖంగా వుండమంటే వుండదూ?

డబ్బుపోతే – పోయిందని తెలియగానే విచారిస్తాడు, కాని వ్యర్థమయిన వయస్సుని వ్యర్థమయినట్లు తెలుసుకున్నప్పుడు— మానవుడు ఎటువంటి వేదనకు గురిఅవుతాడో వూహించటం కష్టం.

ఐతే అటువంటి వయస్సులో ఏ బాధ్యతలైనా లేకపోతే, నెత్తిన వేసుకుని యీడ్చుకుంటూ ప్రపంచంలో తనూ 'ఒక చిన్న వుద్యోగస్థుడిగా, ఒకసంసారిగా – పెద్దమనిషిగా' చెలామణీ అవుతూ వచ్చాడో అటువంటిబాధ్యతలు బంధకాల్నుంచి విడిపించుకుని ఎక్కడికన్నా పరిగెత్తుకునిపోతే బావుండునని పించేది ఒకప్పుడు ఎటువంటప్పుడు? తెగని కూడికల్లో-బోలెడన్ని జమాకర్చుల్లో-రూపాయి అణా పైసల్ని గిట్టించవలసివచ్చినప్పుడు.

మండు వేసంగిలోనైనా నిలువెత్తు కెరటాలు ఎగిరెగిరి మిడిసిపడ్తూండగా-ఉత్సాహంతో జంట జంటలుగా విహంగమాల్లా జనం తిరుగాడుతూంటే అటువంటి కమ్మటి వాతావరణంలో సూర్యాస్తమయ శోభల్ని – లోకం వేసుకునే చీకటి ముసుగులోని అంతర్యాల్ని మననం చేసుకుంటూ స్నేహితుల్తో కులాసాగా కాలక్షేపం చెయ్యటానికూడా వీలయ్యేది కాదు. తెగించి ఒకవేళ ఏ పార్కుకిగాని సినిమాకుగాని వుపన్యాసానికిగాని కులాసాగా నలుగురితో వెళ్ళదల్చుకున్నాడో – సరిగ్గా ఆవాళ, చిట్టాకూడికలు నగదు మొత్తానికి సరిపోకపోవటమో, అసలుచిట్టాలోకి ఎక్కించవలసిన మొత్తాలు—చూస్తూండగా బలిసిపోవటమో ఏదో ఒకటి విధిగా జరిగితీరేది. అదీ యిదీ గాకపోతే సెక్రటరీగారితో ఎవరో వస్తున్నారని ఆహ్వానించటం కోసం స్టేషనువరకు వెళ్లవలసి రావటమో, సంభవించేది సుబ్రహ్మణ్యానికి.

ఈవిధంగా ఎటువంటి ప్రముఖ సంఘటనల్తోనకు సంబంధం ఏర్పడినా, ఎంతలేసి మహాత్ములు – పండితులు – కవులు సభలుచేసి విజ్ఞానం వెదజల్లినా, మాంచి రసవత్తరమైన నాటకాలు ప్రదర్శింపబడినా, చక్కని హృదయరంజకమైన పాట కచ్చేరీలు జరిగినా, ఆఖరికి – ఒక్కనాంట్లోకూడా పాల్గొని సామాజిక జీవిత సుఖాల్ని, అనుభవాల్ని పొందలేక పోయినాడంటే, వాటిమీద తనకుగల అభిరుచిని ప్రేమను క్రమక్రమంగా తగ్గించుకుంటూ – 'దేనితోనూ నాకిక జీవితంతో నిమిత్తం లేదు-దరిద్రుడిగా పుట్టి దరిద్రుల్ని వుత్పత్తించి దేశాన్ని దారిద్ర్యంలోనే ముంచి నిష్క్రమిస్తాను' అన్న మాధ్యమిక దారిద్ర్య జీవితాంతర్గతఫలమైన వైరాగ్యాన్ని అలవర్చుకుని దుస్సహదుర్నిరీక్ష్యగుర్భర దారిద్ర్యాన్ని యావజ్జీవితము విధిలేక భరిస్తూ ఆఖరికి ఏ చివర గడియల్లోనో 'పెన్షను డబ్బుల'న్నా కళ్లజూడకుండా యీ యిహలోక యాత్ర చాలించే వేలాదివేల 'సుబ్రహ్మణ్యాలు', జైళ్లలో దెబ్బలు తిని, యుద్ధాలలో కాళ్లూ చేతులూ విరగ్గొట్టుకుని, అకారణంగా రాజకీయపు కత్తుల్లో వురి తీయబడి, దేశంనుంచి బహిష్కరింపబడినటువంటి 'యోధాగ్రయోధుల' 'దేశభక్తుల' జాబితాల్లోకి రాకపోయినా ఎందులోనూ వారికిసూత్రం తీసిపోరు.

ఎందువల్లనంటే 'సుబ్రహ్మణ్యం' వంటి గుమాస్తాజీవులు గాంధిజీ, మాలవ్యా, తిలకు, గోఖ్లే, వంటి మహాపురుషుల ఛాయలోకే రారు. 'కాళిదాసు – భవభూతి – బాణుడు – శ్రీహర్షుడు' వంటి పూర్వపురుషులకున్న ప్రాముఖ్యతన్నా లేదు. కాని వీళ్ళ మాత్రం అడివిలో ఎండిపోయిన మ్రానుచివర గాలివిసురికి పుటుక్కుమని విరిగి రాలిపోయే ఎండుపుల్ల ముక్కలు.

సుబ్రహ్మణ్యం వంటి బుర్రనమ్ముకున్న వ్యక్తులవల్ల సమాజాలు పొదగబడవు – ఎదగనూ లేవు. కానైతే సమాజంలో కీళ్లుమాత్రం గొప్ప సేవల్ని – కొద్ది ప్రతిఫలానికి చేస్తూ వచ్చారు.

బానిస బ్రతుకుకన్నా అధ్వాన్నమైన రీతిలో కష్టాలు పడుతున్నప్పటికీ, సహిస్తూ, కడుపు చేత్తో పట్టుకుని, జీతపురాళ్లమీద ఆధారపడి పెద్ద పెద్ద గంపంతసంసారాల్ని యీడుస్తూ, పిల్లల్ని కంటూ చదువులు పెళ్లిళ్లు కార్యం కరామత్తులు చేయిస్తూ వున్నట్లుండి ఏదో ఒక సుముహూర్తాన గూటాములై సర్దుకుని పరలోకాలకు ప్రయాణమై పోయారు.

సుబ్రహ్మణ్యం కూడా అటువంటి కష్టజీవుల్లో ఒకడు.

ఆ వేళ సరిగ్గా జీతాలిచ్చేరోజు. ఇంపీరియలు బ్యాంకునుంచి చిల్లర – క్రొత్తనోట్లుకూడా తెప్పించుకుని సిద్ధంగా వున్నాడు కూడా అప్పటికీ ఉదయం పదిన్నరకి, గుప్పెడు మెతుకులు నోట్లో కుక్కుకుని, ఆదరాబాదరా దుస్తులు వేసుకుని, యిచ్చిన తమలపాకులకు వీధిలోనే నడుస్తూ సున్నం రాసుకుంటూ, దారిలో కనపడ్డ ఎలక్ట్రిక్ స్తంభాలకు చెయ్యి తుడుచుకుని కుర్చీలో కూలబడే సరికి తలప్రాణం తోకకొచ్చింది.

రిక్షామీదగాని, సిటీబస్సుమీదగాని వచ్చినట్లయితే యింతకష్టమనిపించదు. కాని జీతపు డబ్బుల్నందుకుంటేనే గాని రిక్షా ఎక్కటానికి గాని, బస్సు నందుకోవటానిగ్గాని తనకు సామర్థ్యమెక్కడిది?

అక్కడికీ పెద్దపిల్ల – తొట్లో పిల్లవాడికి పాలు నోట్లోపెడుతూ 'నాన్నా! ప్రక్కవాళ్లింటి కెళ్లి పావలా చేబదులు తేనా? నడిచేం వెళ్తావులెమ్మని సర్దుకుని లేవబోయింది.

'ఎందుకమ్మా నడక అలవాటేగా-' అని వారిస్తూ, 'వద్దమ్మా! లేవకు. అట్లా చీటికి మాటికి పావలాలకు బేడలకు అందరిళ్లకూ అప్పుకి పోతే పరువు మర్యాద లుండవు. ఒకవేళ ఎదుటివాళ్లు లేదన్నా-విసుక్కున్నా ప్రాణం చచ్చిపోయినట్లనిపిస్తుంది.' అంటూ వీధిలో కొచ్చి వుత్తరీయం ఒక్కమాటు గట్టిగా విదలించి పైనవేసుకుని రెండంగలు కూడా వెయ్యకుండానే – మీనాక్షి గొణుక్కుంటూన్న వాక్యాలు వినపడ్డాయి ఏమని?

'నాన్నా! ఐతే యీకుటుంబంకోసం యీ కుటుంబమర్యాదకోసం నువ్వొక్కడివే కష్టించాలా? నాన్నా ఎంత పిచ్చి నీకు-' అని.

సరిగ్గా ఆ నిమిషాన తోచింది – 'తన యావజ్జీవితము వ్యర్థమయిపోయినట్లు' సుబ్రహ్మణ్యానికి. ఆ బాధే పైకి రాలేక కళ్లవెంబడి బొట్లు బొట్లుగా ధారకట్ట కోటుముడతల్లో యిరికి ఆఫీసుకొచ్చే సరికి గొండిపోయింది.

నిజంగా వ్యర్థమయినదేనా? ఈజీవితానికింక వూపిరి లేకుండా పొట్టకోసం ఎల్లవేళలా కష్టించటమే పరమావధా? ప్రపంచంలో ఎంతలేసి ఘనకార్యాల్ని మానవుడు యీ కొద్ది జీవితకాలంలో నిర్వర్తించి యశస్కాయుడవటంలేదు తనో? తన వుపాధినిమిత్తమే యావజ్జీవితాన్ని కుటుంబపోషణ అనే పేరుతో వ్యర్థంగా కర్చుపెటేసున్నాడే?

అవును! మీనాక్షి అన్నమాటలో అయథార్థం రవ్వంతకూడా లేదు. ఎందువలనంటే సనకుటుంబ మర్యాదకోసం, కుటుంబం కోసం తన తరవాత కష్టించేవారెవరు? ఒకవేళ తనపోతే తన్ను తలుచుకునేవారెవరింక? నిజంగా అంతే కూడా. ఈవాళ సాయంత్రం కాలుడి ఆజ్ఞ ఐతే తను ప్రయాణానికి సిద్ధంగా వున్నాడా?

ఇంటా బయటా చేబదుళ్లు వినహాయిస్తే బోలెడన్ని అప్పులు – యివన్నీ ఎవరు తీరుస్తారు? మూడు వేలకు అరగాని తక్కువైతే పిల్లనుచేసుకోనన్న అల్లుడికి తనకుటుంబముర్యాదను నిలపవలసిన అవుసరం ఏం కలిగింది?

మీనాక్షికి మేనరికమే గనుక చేసివున్నట్లయితే యీ ప్రసక్తి తన కిప్పుడు వచ్చివుండే అవసరం లేదు. రాఘవుడెవరు? తనసహోదరిగర్భవాసాన పుట్టిన దక్కుమాలిన నిసువేగా. ఇప్పుడయితే యిట్లాజరిగింది గాని యింతకుముందు కూడా ఎదుగు మేనరికం పనికిరాదు యీ వ్రకూష దంటూ వచ్చారుగా నలుగురూ. తనయింట్లో తన పిల్లతో పెరిగి పెద్దవాడయి గడ్డాలు మీసాలు వస్తూండగా ఒకనాటి దౌర్భాగ్యపు సాయంత్రాన చేతికందే వయస్సులో వధువున్నాలు షేవలు పరీక్ష పోయిందన్న కారణంగా పరారయి యింట్లోంచి లేచిపోతే – చచ్చాడో బ్రతికే వున్నాడో మళ్లీ వస్తాడో రాడో ఎట్లా తేలటం?

'మీవాడు యుద్ధంలో చేరి మలయా – సింగపూరు – ప్రాంతాల్లో వుంటూ వుండవచ్చునీ, యుద్ధం అయిపోయినాకూడా అక్కడే వుండిపోతాడని పెళ్లాం బిడ్డల్తో నిమిత్తం లేకుండా అక్కడి స్త్రీలతో కాలక్షేపం చేస్తూంటాడని' కొందరంటారు. ఇది నమ్మశక్యంగా లేదు. ఎందువల్లనంటే 'రాఘవుడు' నిజంగా అభిమానంకొద్దీ యింట్లోంచి వెళ్లిపోయుంటే, యీచతురంభోధిపరీతభూవలయంలో ఎక్కడున్నా మీనాక్షి కోసమన్నా రాకపోతాడా అన్న ఆశ కొంతకాలం సుబ్రహ్మణ్యాన్ని బాధించేది.

'రాఘవుడి' వద్దనుంచి 'మావయ్యా నేను కులాసాగా వున్నాను. జీవితంలో స్థిరపడ్డాను' అన్న వుత్తరముక్కన్నా ఎక్కడ్నుంచీ వూడి పడలేదు.

ఇంక ఏ ఆశమీద రాఘవుడు బ్రతికివుంటున్నాడనుకుంటూ ఎంతకాలం ఎదిగిన కూతుర్ని 'పెళ్లి పెటాకులు' చెయ్యకుండా అట్టేబెడ్తాడు.

క్రమంగా మేనరికపుటాశ జీర్ణించిపోగా – 'భగవంతుడా! ప్రభూ! యింత చేశావా! యిన్నేళ్లు పెంచిన మేనల్లుణ్ని దాచి మాయం చేసి నాటక మాడుతున్నావా?' అని విలపిస్తూ మూడు వేల పైబడిన వ్యయంతో మరోపై సంబంధాన్ని చేసి కూతురికి కన్నెచెర విడిపించానని పించుకున్నాడు సుబ్రహ్మణ్యం.

'మీనాక్షి'కూడా యిందు కేమాత్రం అభ్యంతరాన్ని సూచించలేక పోయింది. ఆ పిల్లమనస్సులో ఏమేమి వూహించుకున్నదో, ఏమనుకున్నదో, ఏమేమి తీర్మానించుకున్నదో ఎవరికీ తెలియదుకాని – క్రొత్తమనిషిని యిట్టే పెళ్లాడేసింది. వెంట వెంటనే చాలా గుట్టుచప్పుడుగా ఎక్కువ హృదయభారంతో పిల్లనత్తవారింటికి పంపటం – వెళ్లిన మూడు నాలుగు మాసాలకే ఒక గర్భం నిలవటం – మళ్లీ ఐదారుమాసాలు పైబడకుండా సీమంతోత్సవాల్ని జరిపి గాజులు తొడిగించి పిల్లనింటికి తీసుకురావటం అన్నీ చకచక జరిగిపోయినై. సుబ్రహ్మణ్యానికి 'మనవడ్ని' ఎత్తుకునే అదృష్టం కూడా అచిరకాలంలోనే కలిగింది. కలిగినా ఆ సంతోషరేఖ అతని ముఖసీమలో ఎక్కడా కంచుకాగడాల్తో వెదకిచూచినా కనపడ్డంలేదు.

సహజంగా యిప్పుడు 'రాఘవుడ్ని' గూర్చి ఎవ్వరూ ఎక్కువగా ఆ యింట్లో ప్రసంగించటానికిష్టపడరు. ఏ రైలుక్రిందో చెరువులోనో పడి అసువుల్ని చాలించి వుంటాడని విన్నప్పుడు 'రాఘవుడి'కోసం ఎవరైతే ఎక్కువగా గిలగిల్లాడి బాధపడివున్నారో-వారే ఆ 'మీనాక్షి సుబ్రహ్మణ్యా'లే క్రమ క్రమంగా అతడ్ని గూర్చి స్మరించవలసి వచ్చినపుడు మళ్లీ ఎన్నటికీ తిరిగి రాకుండా వుంటేనే బావుండ్ననే ఆలోచనకు వస్తారంటే, కాలప్రవాహంలో ఎంతటి మార్పులైనా ఎట్లా కొట్టుకుపోగలవో బోధపడక మానదు.

పూర్వం రాఘవుడు చదువుకునే గదిని, వాడి పుస్తకాల్ని, వాడి బట్టల్ని – ఆరోజున పైమీద ఒకే ఒక వుత్తరీయంతో గృహపరిత్యాగం చేసిననాటినుంచి కొన్నాళ్లవరకూ మహోచారిత్రికమైన వస్తువులుగా భావించి యింటి పాదీ చూసుకున్నారు. ఇంత యెందుకు? ఆఖరికి 'మీనాక్షి' శోభనం నిమిత్తం ఆ గదిని కాళీచేసి పక్క సమర్చవలసి వచ్చినప్పుడు ఒక్కొక్క ప్రియ బాంధవుడి సంస్మరణచిహ్నాన్నీ అంటే పక్కచుట్ట పుస్తకాల్ని – చొక్కాల్నీ తీసి ఒక గూటిలో నిరుపయుక్తాలుగా గిరాటుపెట్టవలసి వచ్చినపుడు అదే రాఘవుడికదిలో – రఘువుడితో కాకుండా మరొక వినూత్నవ్యక్తితో మీనాక్షిని కలుపుతున్నాననే శంకతో సుబ్రహ్మణ్యం మనస్సెంతగా క్షోభించి వుంటుందో ఎవ్వరూహించగలరు?

ఎప్పుడూ అంతర్యంలో ఒక ద్వంద్వ యుద్ధం జరుగుతూ వుండేది సుబ్రహ్మణ్యానికి. దానికి మనవడు కలిగాడనే సంతోషం లేకపోవటం ఒక కారణం. కూతురిమీద ప్రేమకొద్దీ ఎత్తుకుని లాలించినా 'యీ నిసువు తనకేమీ కాడేమో-?' అనిపించేది మనస్సులో.

'వీడు నీ మనవడేగదా వాడ్ని నువ్వు పరిపూర్ణంగా అభిమానించి నిష్కల్మషంగా ఎందుకాదరించలేవు?' అని ప్రశ్నించేది మనస్సు.

'వీడితల్లి నా కూతుర్ని ఏలటంకోసం నాదగ్గర గుంజిన మూడువేలకి ఫలితంఅందువల్ల నేను అథఃపాతాళానికి అంటే భవిష్యత్తులో నేను చచ్చేదాకా తీర్చవలసినంత అప్పుకి ఫలితం వీడు. నా కూతుర్ని ప్రేమించినంతగా వీడ్ని ప్రేమించలేక పోతున్నాను.' అని సమాధానమిస్తుంది అంతరాత్మ.

తిరిగి మనస్సు వూరుకుంటుందా-త్యజభర్జనలు చేస్తానంటుంది ఏమని? 'ఓయి సుబ్రహ్మణ్యమా-యిదేమి పక్షపాతం నీకు రాఘవుడి కొడుకే ఐతే నీ వెట్లా ప్రేమించి వుండేవాడివి? ఇది నీకు ధర్మంకాదు. రాఘవుడివల్ల మీనాక్షికి కలిగితే ఎట్లా ఆదరించి ప్రేమించేవాడివో అట్లానే యీ పిల్లవాడ్నికూడా ఎందుకు చూడవు?' అని.

దీన్ని పూర్వపక్షం చేస్తూ అంతర్యంలో యిట్లా ధ్వనిస్తుంది. 'ఒకప్పుడు నీ వన్నట్లు రాఘవుడే నాకూతుర్ని ఏలటం సంభవిస్తే వాడి కొడుక్కి యిట్టి అనర్థం జరిగే అవకాశాన్ని వాడు ఒక్కనాటికీ సృష్టించుకునేవాడు కాదు. ఎందువల్లనంటే రాఘవుడితో నాకుగల బాంధవ్యం అర్థజ్ఞానాతీతమైన ప్రేమసంబంధం-' అని.

గతించిన జీవితాన్ని తలపోసుకుంటూ భవిష్యత్తునెందుకు దుఃఖభాజనం చేసుకుంటూ వన్న ప్రశ్నకు సమాధానంమాత్రం దొరకలేదు సుబ్రహ్మణ్యానికి.

ఆఫీసులో జవానుకూడా సుబ్రహ్మణ్యం వాలకాన్నిచూసి నవ్వుతాడు. దర్మార్థం వారింటికి పోయినప్పుడల్లా మేనేజరు గాకుండా ఆయన కొడుకు సైతం 'ఏమయ్యా' అని అథార్టీ చెయ్య

(16-వ పేజీ చూడుడు)

నారసింహ లేహ్యము
బంగారు చేర్చబడినది. మేహము. నిక్కాకం. నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—
తు॥ దబ్బి రు 3-4-0 పోస్టేజి 10 అ.
పి. సి ఏ & కంపెని. పెరిదేపి-నెల్లూరు జిల్లా
బ్రాంచి 7 సీను మొదటివీధి మద్రాసు.

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో; రాజమండ్రి

# "అదృష్టహీనులు"

(11-వ పేజీ తరువాయి)

బోతాడు. నలభైయేళ్లపైబడిన మనిషిని తన్ను ఆయనభార్య 'ఏం వోయి సుబ్రహ్మణ్యం బజార్లోంచి వచ్చేటప్పుడు నాలుగుకోళ్లు చూసి వంకాయలన్నా తెచ్చిపెట్టక పోయావా, చస్తాంటే యింట్లో, మీ మానేజరుగారివల్ల ఒక్కపనీ కాదు ఎందుకూ పనికి రారులే-' అంటుంది. ఆయనకూతురు 'పంతులూ యిటు చూడు' అంటూ ఏదో పురమాయిస్తుంది.

'ఓయి భగవంతుడా! వీళ్ల నెత్తుటిలోనే యింత చలాయింపుతత్వం యిమిడివుందేమయ్యా' అనుకుని విస్తుపోతూంటాడు సుబ్రహ్మణ్యము.

కాని యీవాళ యీ తరహా ఆలోచనలతో మనస్సు పాడుచేసుకుని బాధపడుతున్నా 'పంచేంద్రియాలు' యంత్రప్రాయంగా తమపని తాము చేసుకుని పోతున్నై. ఎందరెందరో తమ కాతాల్లో పెద్దపెద్ద మొత్తాల్ని జమకట్టారు. తన చేతుల్లో తను ఎన్నివేలో లెక్కబెట్టి చెక్కులన్నిటికీ 'పేమెంట్లు' చేస్తూ వచ్చాడు కూడితే జమలన్నీ టక్కున సరిపడ్డాయి. అటుపై పుకర్చుల మొత్తంకూడా కూడితే 'యిక పని అయినట్టే-' అనుకుని యింతలో 'యీవాళ నెలాఖరుగదూ-ఏది జీతాలబిల్లు' అని జవాన్ని రివెన్యూ అణా బిళ్లల్ని అంటించమని చెప్పి పెద్దనోట్లను చిన్ననోట్లను - నూనిమగకలు పడ్డవాటిని కొద్దిగా చిరిగినవాటిని వేరుచేస్తూ. చిల్లర లెక్కపెట్టడంలో నిమగ్నుడైపోయాడు.

రోజూ యింతే. సరిగ్గా నిలవల్ని తేల్చేటప్పుడు గుండెలు పీచుపీచుమనేవి. ఈ వెధవ షరాబు వుద్యోగం యింతేగదా! దినదిన గండం వెయ్యేళ్లాయుస్సు. అనుకుంటూ ఆఫీసుకి రాంగానే శ్రీరామ అరచేతిలో వ్రాసుకోందే యినప్పెట్టి తాళం చెవుల్ని ముట్టుకునే వాడు కాడు. ఆ శ్రీరామమూర్తికటాక్షవీక్షణపరంపర చేతనే యిటువంటి ఆఘాతాలు లేకుండా తనపని తాను చేసుకుంటూ నమ్మకస్తుడైన వ్యక్తనిపించుకున్నాడు కూడా.

నేడు ఆ శ్రీరామచంద్రమూర్తికూడా కాసంత శీతకన్ను వేశాడు. అంతా తారుమారయింది. ఎన్నిలెక్కలు సరిచూసినా ఎన్నిసందల మాట్లు కూడినా తక్కువొస్తున్నది రెండు వేలు. తలమీద పిడుగు పడినట్లయింది. ఒకవేళ పిడుగు పడితేనన్నా 'అర్జున - ఫల్గుణ - పార్థ - శ్వేతవాహన - కిరీటి' అనొచ్చు. ఈ పిడుక్కు ఏ మంత్రంకూడా పారేట్టు లేదు.

అనుకున్నంత పనీ అయింది. వంద ముల్లు మంది సుబ్రహ్మణ్యానికి. ఎప్పుడు ఎవరికి ఎక్కువిచ్చాడో 'రెండువేలు' అంటే వందరూపాయల నోట్లకట్టలు రెండు తక్కువన్నమాట. సుబ్రహ్మణ్యం మొగాన కత్తివ్రేటుకు నెత్తురుచుక్క లేదు ఆఖరికి మేనేజరుకూడా నానాతంటాలు పడి చూశాడు. నిజమే! రెండువేలు ఎక్కువ యివ్వటం ఎవరికో జరిగింది.

సుబ్రహ్మణ్యానికి మనస్సు మనస్సులో లేదు. బయట వానజల్లు. కొద్దిగా అప్పుడప్పుడూ యీదురుగాలి. మధ్య మధ్య వికారంగా పిట్టల అరుపులు. పెద్ద పెద్ద చెట్ల మధ్యనుంచి బీభత్సంగా రివటలుకొట్టే దెయ్యపుగాలి. స్వప్నవేశాన్ని అతిభీభత్సకరంగా చిత్రించి వేశాయి.

తెప్పరిల్లుకుంటూ - 'వెళ్లి మనం కొందరు కాతాదార్లవద్ద దర్యాప్తు చెయ్యాలి. దానివల్ల ఏమన్నా ఫలితముంటుందని తోస్తోంది నామట్టుకి. మీ రేమంటారు.'

మేనేజరు నవ్వుతున్నాడు అట్టహాసంగా - నవ్వు మధ్యలో ఆపి 'సరి నువ్వన్నట్లు వెళ్దామయ్యా - అసలు యింట్లోకాలు బయటపెట్టడానికే వానొకటిగా కినల్లే. జట్కా ఎవడు కట్టాడు యీ ముసురులో-'

సుబ్రహ్మణ్యానికి మనస్సులో నడచి పోదామనే ఉంది. ఆ మాట పైకంటే అసలే అసలే కాకి అందులో కోతి, కల్లు త్రాగింది - ముల్లు గుచ్చుకుంది - నిప్పుకూడా తొక్కింది. ఎక్కడ కోపవివశుడవుతాడో అన్నభయంతో 'నేనే వెళ్లి జట్కా పిలుచుకొస్తాను - తెమిలి వుండండి మీరు.' ఇంకా వెకిలినవ్వు నవ్వుతూనే వున్నాడు. వున్నట్టుండి 'వెళ్లవయ్యా - వెళ్లి పిల్చుకురా-' అని మళ్లీ ఏమనుకున్నాడో ఏమో 'వుండు సుబ్రహ్మణ్యం-నువ్వెళ్లరా పాపయ్యా', అని మరొకడ్ని పంపాడు.

జట్కా వచ్చి నిల్చుంది. వాన తగ్గేట్టు లేదు. వాడు అయిదురూపాయలు కావాలన్నాడు. సుబ్రహ్మణ్యం ఏమాత్రం అడ్డు చెప్పలేదు. మేనేజరు 'యీ కర్చుకూడా నువ్వే భరించాలిసుమా!' అన్నట్లు చూశాడు.

'చిత్రం మహాప్రభో! నిండా మునిగినవాడికి చలేమిటి?',అంటూ మనస్సులో రెండువేలు నష్టంకాగా ఐదు ముష్టివెధవ రూపాయలు మన ప్రాణాని కడ్డుపడతాయా అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

నిలవలు తీసి కాతాల్లో రెండువేలు నష్టం చూపించి - వూరిమీద ఎవరెవరైతే పెద్దమొత్తాలు పట్టుకెళ్లారో వాళ్లందరీ గడపలు 'అమ్మా - బాబూ' అని బ్రతిమాలుకుంటూ తిరిగాడు సుబ్రహ్మణ్యం. లేకపోయింది ఫలితం. ఈ జట్కారుసుం కూడా జులుములా వదిలింది.

మేనేజరు కూడా సుబ్రహ్మణ్యానికి పట్టిన అవస్థకు జాలిపడుతూ చెప్పలేక 'రేపుసాయంత్రం లోగా మీ సొమ్ము భర్తీచెయ్యాల్సి వుంటుంది. జ్ఞప్తిలో వుంచుకోండి.' అని హెచ్చరించి జట్కా దిగి వెళ్ళిపోయాడు. మేనేజరు వెడుతూ అనుకున్నాడు 'ఎవరు చేసిన కర్మ వారనుభవింపక ఎవరికైనను తప్పదన్నా' అని. కొంతసేపటికి జట్కావాడు 'ఎక్కడ దింపమంటారు బాబూ, అని అడిగిన ప్రశ్నకు-సుబ్రహ్మణ్యం 'గంగలోకి-' అని మాత్రమనగలిగాడు. జట్కావాడు ఏమాలోచించుకున్నాడో-ఐతే యిక్కడ దిగి పొండి బాబూ!' అంటూ పరీక్ష కోసం అగ్గిపుల్ల ముట్టించి బీడీ ముట్టించుకుని ఆ వెలుతుర్లో సుబ్రహ్మణ్యంముఖాన్ని పరీక్షగా చూసి గుజ్జాన్ని విలేశాడు. మాట్లాడకుండా దిగి ఐదు రూపాయలు వాడిమొహాన పారేసి పెద్ద పెద్ద అంగలు వెయ్య నారంభించాడు. త్వరగా యింటిముఖం పడుతూన్నకొద్దీ హృదయం భారమై పోసాగింది. సందులన్నీ తిరిగి యింటి మలుపులో లాంతరు స్తంభం వెలుతుర్లోకి వచ్చేసరికి సుబ్రహ్మణ్యానికి వళ్లుకూడా స్వాధీనం తప్పిపోయింది.

ఇక వున్నట్లుండి లాంతరు స్తంభంనీడని యిసకలో కూర్చుండి పోయి బిగ్గరగా గొంతెత్తి ఏడువ నారంభించాడు. చీకటి - వాన యింకా కురుస్తూనే వున్నది. యించుమించుగా అర్ధరాత్రి సమయం. యీ నిర్భాగ్యుడి దుఃఖాన్ని వినడానికింకా ఎవరు మేలుకొనుంటారు? ఆ కొద్ది వెలుగులో పొంగి పొరలి వస్తూన్న దుఃఖానికి చెలియలికట్టను వేయలేక చిన్నపిల్లవాడేడ్చినట్టు గొంతెత్తి 'అమ్మా! అమ్మా!'అని ఆ స్తంభాన్ని కావలించుకుని మరీ వాపోసాగాడు. జల్లుజల్లుగా కురుస్తూన్న వాన ముసురేసుకు పోతున్నదనే ఉత్సాహంతో కప్పలు సంతోషంతో అరుస్తున్నాయి.

ఒకటి రెండు పందులు మోర లెత్తి చెవులు నిక్కించి వింటున్నాయి. రెండు కుక్కలు కాస్సేపు తిరిగి దగ్గరకు వచ్చినిల్చునివిచిత్రంగా కళ్లు పెద్దవిచేసి కూర్చుని సావకాశంగా సుబ్రహ్మణ్యంయొక్క దుర్బలత్వాన్ని - నిస్సహాయతకు తమకంతు సానుభూతిని వ్యక్తపరుస్తున్నాయి.

సరిగ్గా అటువంటి లాంతరు స్తంభంనీడను ఒక జట్కావచ్చి ఆగిపోయింది.

'ఎందు కాపావు. పోనియ్యి..' లోపల్నుంచి ఎవరో జట్కావాడ్ని ప్రశ్నించారు. బండివాడు దిగి 'దారి కడ్డంగా ఎవరో మనిషి పడి ఏడుస్తున్నాడు? ఏం చేసేది-'

ఆ బండిలోని వ్యక్తికూడా నేల కురికాడు యీ నిర్భాగ్యుడ్ని పరీక్షించేందుకు. గుఱ్ఱంకూడా డెక్కల్ని చప్పుడు చేస్తూ తలను ఆడించి నిలబడిపోయింది.

ఆ మనిషి యీ అపరిచితవ్యక్తిని లేవనెత్తి ప్రశ్నించాడు 'ఏమయ్యా ఎవరు నువ్వు-యిట్లా యెందుకు పడిపోయావు గనిక?' సుబ్రహ్మణ్యం-కళ్లు తెరిచి పరీక్షిస్తున్నాడు ఎవరీ అపరిచితుడని. నల్లటి వుంగరాలజుట్టు-మనిషి వేషం కట్టు ఉత్తర హిందూస్థానీ వేషం. ఆ గుడ్డిదీపం వెలుగులో ఆకర్షణీయంగానే వున్నాడు. ఆ ఆజానుబాహువు జాలిపడుతూ- 'ఎవరు బాబూ మీరు? ఎక్కడారా - మీ యింటిదగ్గర దిగుదాం-' ఆ వ్యక్తి నిదానంగా సుబ్రహ్మణ్యం సమాధానం కోసం కనిపెట్టుకోకుండా బండిదగ్గరకు జట్కావాడి సాయంతో నడిపించుకు పోసాగాడు.

సుబ్రహ్మణ్యానికి తెలివి కలిగింది. 'ఎందుకు? యిదే మాయిల్లు - వెళ్లిపోతాను.' అంటూ వంకర తిరిగిన మెట్లకేసి చూపిస్తూ ఆ సన్నటి దీపపు వెలుగులో కృతజ్ఞతాపూర్వకంగా చేతు లెత్తి-'నమస్కారంనాయనా-' అంటూ ముందుకు మెల్లిగా పురోగమిస్తూ 'అమ్మాయీ!' అని తలుపుమీద మూడుసార్లు తట్టి, 'ఇక మీరు వెళ్లవచ్చు-' అంటూ మళ్లీ హెచ్చరిస్తూ వెనుదిరిగి చూశాడు.

ఆ మెట్లు చీకట్లోకి తీసుకుపోయేటట్లున్నాయి. ఆయింటి కప్పుద్వారాన్నికూడా కటిక చీకట్లో ముంచివేసింది. వాన జల్లుకి తడిసిన గచ్చుమీద యిసక బర బర లాడుతోంది.

ఆ అపరిచితుడు సందేహిస్తూ అట్లానే నిల్చుండి పోయాడు. అతని పాదాలు కర్తవ్యాన్ని బోధించినా మనస్సు 'యింకా కాస్సేపు యిక్కడ ఆగుదా'మని సలహాయిస్తోంది.

సుబ్రహ్మణ్యం 'మీనాక్షీ! మీనాక్షీ!' అని యింకా బిగ్గరగా అరిచాడు. అతనట్లా వుచ్చరించిన నామాక్షరాలు అపరిచితుడి హృదయకవాటాలమీదుగా మూసుకుని పోయినై.

ఆ తలుపు తెరుచుకుంది. క్రొత్తగా పుట్టిన మాతృత్వశోభలో 'మీనాక్షి' అద్భుతంగా వుంది. ఆ అపరిచితుడు కూడా - పోల్చుకున్న వుత్సాహంతో, 'మీనాక్షీ - మీనాక్షీ' అని ముందుకు వంగి 'మావయ్యా-' అంటూ సుబ్రహ్మణ్యాన్ని రెండు చేతుల్తోనూ హృదయానికి హత్తుకున్నాడు.

మీనాక్షి చేతిలోని హరికెను దీపాన్ని టక్కున నేలకు వదిలేసి విస్తుబోయి చూస్తూ నిలబడింది.

వాడు రాఘవుడు.

అతడు సుబ్రహ్మణ్యము.

ఆమె మీనాక్షి.

నిజంగా కొన్ని సంవత్సరాల క్రితం ఏ రాఘవుడైతే అభిమానంకొద్దీ స్వజనాల్ని బంధుమిత్రాదుల్ని వదలి బొంబాయి చేరుకుని మార్వాడీలవద్ద గుమాస్తాగా కుదురుకున్నాడో ఆ రాఘవుడు తన స్వప్రయోజకత్వంవల్ల నైతే నేమీ, అదృష్టంవల్ల నైతే నేమీ వ్యవహారదక్షుడై క్రమక్రమంగా పైకి వచ్చి విదేశాలకుకూడా పోయి డబ్బు సంపాదించుకుని - అప్పుడు మేనమావ కూతుర్ని జ్ఞప్తికి తెచ్చుకుని వస్తే యింకా ఎక్కడి మేనమామ కూతురు?

రాఘవుడికి సర్వం అర్థమయింది. ఆ యింట్లో ఒక్కమాటు, తనంతట తాను తన స్థానాన్ని నిర్మూలించుకున్నాడు. ఇప్పుడు నిజంగా తనకాయింట్లో స్థానం లేదు. మీనాక్షి తన కెవరు? ఏమీ కాదు. తను బ్రతికి వున్నట్లు వ్రాసిన వుత్తరాలన్నీ అందినపాపాన పోలేదు.

మర్నాడు సాయంత్రం రాఘవుడు సామాను బండి కెత్తుతూ 'రెండు వేల రూపాయలకు' చెక్కు వ్రాసి మేనమామ కిస్తూ 'సెలవు మావయ్యా. మీనూ-' అని ఒగర్బుతున్న స్వరంతో 'నువ్వు కూడా నేను చచ్చిపోయాననే అనుకున్నావా? ఎంత పని చేశావ్ మీనూ!' అంటూండగా,

రాఘవుడి కళ్లలోంచి ముత్యాలు తొంగి చూశాయి. మీనాక్షి కొడుకుచిట్టి చేతుల్ని పట్టుకుని దండం పెట్టించింది. రాఘవుడు ప్రీతిగా చెయ్యి వూపాడు బండిలోంచి నవ్వు తెప్పించుకుంటూ.

---

# కాంగ్రెస్ పాలన

(9-వ పేజీ తరువాయి)

వాళ్ళచేత జరిగి వున్నట్లయితే ప్రభుత్వం ఈ సరికి అధికారాపేక్షోత్పత్తి ఉద్యమానికి స్వస్తి చెప్పి వుండేది.

దేశంలో ఏర్పడిన ఈ విపరీత పరిస్థితికి కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన పద్ధతికూడా కొంతవరకు కారణమని చెప్పాలి. ఈ మంత్రివర్గంలో రెండు వర్గాలవారు వున్నారు. ఒకరు కాంగ్రెస్ వర్గానికి సంబంధించినవారు. ప్రభుత్వ విధానాలను దిద్దితీర్చే శాఖలన్నీ వీరి చేతిలో వుంటాయి. రెండో వర్గంలో కాంగ్రెస్ వాదులు కానివారు వున్నారు. ప్రభుత్వాదాయంలో పెంపుదలచూపే శాఖలన్నీ వీరి నెత్తిన రుద్దారు. దేశం దివాళాతీసే స్థితిలోకి వచ్చిందనుకోండి, అప్పుడు ఆ తప్పంతా ఆర్థికమంత్రి నెత్తినపడుతుంది. విదేశ వాణిజ్యంలో మనం ఇతరదేశాలకు బాకీ ఇవ్వ తేలతామనుకోండి, ఆ తప్పంతా వాణిజ్యశాఖామంత్రి నెత్తిమీద పడుతుంది. దేశంలో పారిశ్రామికోత్పత్తి వెనకపడి వుందనుకోండి. పారిశ్రామికమంత్రి కర్మాన పారిశ్రామికమంత్రి పోతాడు. పోతే మౌలానా ఆజాదును, జగ్జీవనరాంను, గాడ్గిల్‌ను, జయరాందాస్ దౌలత్‌రాంను ప్రశ్నించేవారూ లేరు; విమర్శించేవారూ లేరు.

ప్రస్తుతం మనదేశ ప్రభుత్వాన్ని ఏలుబడి సాగిస్తున్నది రాజకీయాలని అనుకుంటే మీరు పొరబడినవాళ్లవుతున్నారు. మన ప్రభుత్వ వ్యవహారమంతా తెరవెనక వుండి నాటకం ఆడించడంగా వుంది. ఒక మంత్రి తెరవెనకవుండి ఒకత్రాడు ఇట్లా లాగితేచాలు, ఆయన ఏది అనుకుంటే అది జరిగిపోతుంది. దేశానికి కావలసింది, తినడానికి తిండి; కట్టుకోడానికి గుడ్డ; నివసించడానికి ఇల్లు. నాట్యాలతోను, లలితకళాప్రదర్శనాలతోను, సాంస్కృతిక సమావేశాలతోను ఆకలితో అలమటించిపోతున్నవారి కడుపునిండదు. ప్రజలకు సామ్యమైన ఆహారాన్ని చేకూర్చాలని అప్పుడప్పుడు వినపడుతూవుంటుంది. సామ్యమైన ఆర్థికవిధానం, సామ్యమైన అభివృద్ధి పథకాలు, సామ్యమైన ఆదాయ వ్యయ విషయకమైన అంచనాలు సరిగ్గా సంతరిస్తే చాలు స్వామ్యమైన ఆహారాన్ని సమకూర్చినదానికంటే దేశానికి ప్రజకు మేలు జరుగుతుంది.

ప్రస్తుత దేశపరిస్థితినిగూర్చి ఇంకో విషయాన్నికూడా చెప్పాలి. ఒకసారి మద్రాసులో మాట్లాడుతూ భారత ప్రధాని దేశాన్ని యుద్ధసమయంలోలాగా సన్నద్ధం చేయాలన్నారు. అన్నిపథకాలను వాయిదా వేయాలన్నారు. ఈ పద్ధతి రాష్ట్ర ప్రభుత్వాలకుగాని, కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులకుగాని రుచించలేదు. ఇప్పుడుగూడా భారత ప్రధాని మాటను వీరు చెవిని పట్టించుకోవడంలేదు. దూరదృష్టిగల రాజకీయవేత్త భవిష్యత్తును గూడా పారచూస్తాడు. వట్టి రాజకీయ

(21-వ పేజీ చూడుడు)

---

సైన్యంలో నిరాశ ... లు ... సైన్యం అంతా చిందరవందరగా ... పోయింది. చివరికి ఫలితం ఏమవుతుందో అనే ఆలోచన ఎవరికీ లేదు. నాయకత్వంలేని సైనికులంతా ధైర్యంతో పోరి ప్రాణాల్ని కోల్పోతున్నారు. శత్రు సైన్యాలు వీరి వీరతకి చాలా ఆశ్చర్యపోతున్నారు. కాని యిటువంటి యుద్ధాల్లో వచ్చేది పేరు కాని విజయం కాదు. ఒక ఘంటలో వేదికమీద తెర వేయబడింది.తమాషా పూర్తి అయింది.

చీకటి తెర—మృత్యుదేవత తాండవము—ఉన్న కొంత సైన్యం శత్రుజనాలకి కష్టాలని కలిగించింది. కాని నాయకుని జాడ లేదు. రత్నసింహుని కోసం ఆ పర్వతంమీది ప్రతి రాయి వెతికి చూచారు. కాని రత్నసింహుడు కనుపించలేదు. విజయం......అసంపూర్తి......! (సశేషం)